కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

- కాంగ్రెస్ నాయకులకు మంత్రి వివేక్ సూచన



కార్మికమంత్రి వివేక్‌ను సన్మానించిన సుబ్బారావు

చిక్కడపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి సూచించారు. నూతనంగా మంత్రిగా నియమితులైన జి.వివేక్‌ను సోమవారం ఎస్సీ, ఎస్టీ షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్, కాంగ్రెస్ నేత కంది సుబ్బారావు సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ముఖ్యంగా కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, వివిధ సంఘాల నేతలు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● మాజీ ఎంపీ వీహెచ్‌కు సత్కారం



మాజీ ఎంపీ వి.హనుమంతరావును సోమవారం సత్కరిస్తున్న ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ ఎం.కోదండరాం, బల్మూర్ వెంకట్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్. రాములు, యువజన కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల అభిజిత్ యాదవ్ తదితరులు - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

ఆకట్టుకున్న గీత విభావరి

చిక్కడపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాయకుడు టి.రామోజీ ఆలపించిన గీతాల కార్యక్రమం ఆకట్టుకుంది. ఆదివారం రాత్రి త్యాగరాయగానసభలో బాలాజీ ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫౌండేషన్ గ్లోబల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో వంశీ సంస్థల అధినేత డా.వంశీ రామరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని రామోజీని ఘంటసాల బంగారు పతకంతో సత్కరించి అభినందించారు. వెంకటలక్ష్మి, రాధారాణి, సరస్వతి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



అవార్డులను పొందినవారితో అతిథులు

రక్తదాత సుఖీభవ అవార్డుల ప్రదానం

చిక్కడపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రాణదానంతో సమానమైంది రక్తదానం అని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రముఖ రచయిత కె.మురళీమోహన్‌రాజు అన్నారు. సోమవారం గాంధీనగర్ డివిజన్‌లో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖులకు రక్తదాత సుఖీభవ అవార్డులను ప్రదానం చేశారు. మురళీమోహన్‌రాజు మాట్లాడుతూ ప్రతి ఆరోగ్యవంతుడు 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయొచ్చన్నారు. నటరాజ్, దేవిరెడ్డిసురేష్‌రెడ్డి, రామకృష్ణ, రమేష్, బాలమురళీకృష్ణ, రాజు, బాలమురుగన్, కీర్తనపరమేశ్వరన్, దేవపత్ని, రఘు తదితరులకు అవార్డులు బహూకరించి సత్కరించారు. ఆనందయ్య, శ్రీనివాసులు, రియాజ్‌బాషా, శశిధర్, రామచంద్రరావు, చెన్నయ్య, ఎస్ ఎస్ యాదవ్, సత్యనారాయణ, రమణయ్య, జ్యోత్స్న, రవి తదితరులు పాల్గొన్నారు.

సేవే లక్ష్యం : వాసవీక్లబ్



సైనికులను, రైతులను సన్మానించిన వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు

ముషీరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ సేవే లక్ష్యంగా పనిచేస్తూ ప్రజలకు సామాజిక బాధ్యతతో సహాయసహకారాలు అందిస్తున్నదని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు గార్లపాటి సతీష్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ సరస్వతి ఆలయ ప్రాంగణంలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ నాయకులు జయప్రకాష్‌రావు ఆధ్వర్యంలో డాన్ టు డెస్క్ కార్యక్రమంలో భాగంగా సరస్వతీ దేవాలయానికి వెయ్యిలీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యశిబిరం, యోగా క్యాంపును నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు.

వీరశైవ లింగాయత్ ఆదర్శ దంపతులకు సన్మానం

ముషీరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వీరశైవ లింగాయత్, జంగమ సమాజం సంయుక్త ఆధ్వర్యంలో వీరశైవ లింగాయత్ ఆదర్శ దంపతులకు సోమవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోమలింగ శివచారియా మహాస్వామి ఆదర్శ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీరశైవలింగాయత్ నాయకులు వీరేందర్, శ్రీనివాస్, సతీష్, బస్వరాజ్, గౌరీశంకర్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ ఉపాధ్యక్షుడిగా వీరేశ్‌గుప్తా



ముషీరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ నూతన కమిటీ ఉపాధ్యక్షుడిగా వీరేశ్‌గుప్తా నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని డివిజన్ అధ్యక్షులు రాజశేఖర్ ప్రకటించారు.

గద్దర్ అవార్డ్స్ అవమానకరం

రాంనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కళ కళ కోసం కాదు కళ ప్రజల కోసం అంటూ జీవితాంతం పనిచేసిన ప్రజాగాయకుడు గద్దర్ అవార్డ్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం విలువలు లేని సినీ క్రిమినల్స్‌కు అవార్డులు ఇచ్చి అవమానపరిచారని తెలంగాణ ప్రజాసాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు ఆరోపించారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జానపద కళాకారులను జ్యూరీ కమిటీలో పెట్టాలి కదా? ఎందుకు పెట్టలేదన్నారు. ఈ అవార్డుల కమిటీని వెంటనే రద్దు చేయాలని, మార్గదర్శకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో చిర్ర రమేష్, చంద్రయ్య, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి మెడికల్ రిప్రజెంటర్ ఆత్మహత్య

బర్కత్‌పుర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో రైలుకింద పడి మెడికల్ రిప్రజెంటర్ ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గౌలిపురలో నివాసం ఉంటున్న కె.అనిల్(38) ఫార్మసీ కంపెనీలో మెడికల్ రిప్రజెంటర్. అతనికి భార్య, ఇద్దరు సంతానం. కొంతకాలంగా కుటుంబ కలహాలతో సతమతమవుతున్నాడు. సోమవారం ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

● మరో సంఘటనలో 45 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి డబీర్‌పుర - ఉందానగర్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్రగాయాలతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ రెండు సంఘటనలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు ప్రయాణికుడిపై దాడి.. నగదు, సెల్‌ఫోన్ చోరీ

బర్కత్‌పుర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుడిని కొట్టి నగదు, సెల్‌ఫోన్‌ను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాలప్రకారం. ఈనెల 9న వారసిగూడకు చెందిన కనకయ్య(50) ఎంఎంటీఎస్ రైలు ఎక్కడానికి మలక్‌పేట రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. గుర్తు తెలియని ఇద్దరు కనకయ్యను కొట్టి అతని జేబులోని సెల్‌ఫోన్, రూ.800 నగదు లాక్కొని పారిపోయారు. సోమవారం కనకయ్య కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఈకేవైసీ లేదు.. రేషన్ ఇవ్వం

- కొన్ని రేషన్‌షాపుల్లో డీలర్ల ఇష్టారాజ్యం
- నెల క్రితం పేర్లు యాడ్ అయిన వారికీ తప్పని తిప్పలు
- 3 నెలల బియ్యం అందక నిరాశతో వెనుతిరుగుతున్న లబ్ధిదారులు



బయోమెట్రిక్‌లో రెడ్ మార్కు వస్తుందని బియ్యం ఇయ్యని రాంనగర్‌లోని రేషన్ షాపు

ముషీరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యం పౌర సరఫరాల శాఖ 3 నెలల రేషన్ బియ్యం లబ్ధిదారులకు ఒకేసారి ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులలో కొందరి పేర్లు యాడ్ చేయడంతో పాటు కొత్త రేషన్ కార్డులు కూడా జారీచేసింది. ఈ నేపథ్యంలో ఈ కేవైసీ చేసుకోని వారు తప్పకుండా చేసుకోవాలని డీలర్లు సూచిస్తున్నారు. కానీ కొందరు రేషన్ డీలర్లు ఈ-కేవైసీ చేసుకోలేదనే కారణంతో లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండానే వెనక్కి పంపిస్తున్నారు. కొన్ని రేషన్‌షాపుల్లో 'మీ పిల్లల పేర్లు రేషన్ కార్డులో ఉన్నపటికీ ఈ కేవైసీ చేయలేదు. బియ్యం ఇవ్వం' అని వెనక్కు పంపిస్తుండడంతో రేషన్‌కార్డుదారులు నిరాశతో వెనుదిరిగుతున్నారు. నెల రోజుల క్రితమే రేషన్‌కార్డులో పేర్లు యాడ్ అయ్యాయని త్వరల్లో ఈ కేవైసీ చేపిస్తామని చెప్పినా పట్టించుకోవడం లేదు. చివరికి సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా బియ్యం ఇవ్వడం లేదని రేషన్‌కార్డుదారులు వాపోతున్నారు. రాంనగర్‌కు చెందిన ఓ కార్డుదారుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. నలుగురి పేర్లు రేషన్ కార్డులో ఉన్నాయి. సోమవారం రేషన్ బియ్యం తీసుకోవడానికి రాంనగర్‌లోని 365వ నెంబర్‌గల రేషన్‌షాపునకు వెళ్లాడు. రేషన్ కార్డులో నలుగురి పేర్లు ఉన్నప్పటికీ ముగ్గురికి మాత్రమే బియ్యాన్ని రేషన్ డీలర్ ఇచ్చాడు. ఇంకో పేరుకు రేషన్ బియ్యం ఎందుకు ఇవ్వరని కార్డుదారుడు ప్రశ్నిస్తే ఈ కేవైసీ చేయలేదని, బయోమెట్రిక్‌లో రెడ్ మార్కు చూపిస్తున్నందున బియ్యం ఇవ్వమని చెప్పాడు. గత నెలలో నలుగురికి బియ్యం ఇచ్చారని, ఈసారి ఎందుకు ఇవ్వరని కార్డుదారుడు ప్రశ్నిస్తే 'ఇచ్చిన రేషన్ షాపులో తెచ్చుకో' అని కసురుకున్నాడు. ఆ రేషన్ షాపులో కొద్ది రోజులుగా రేషన్‌కార్డులో పేరు ఉన్నప్పటికీ ఈ కేవైసీ చేయలేదనే కారణంతో కొందరికి బియ్యం ఇవ్వకుండానే వెనక్కి పంపిస్తున్నారని పలువురు బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అర్హులందరికీ బియ్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

రేషన్ షాపునకు వెళ్లి పరిశీలిస్తాం. డీలర్‌తో మాట్లాడి వివరాలు సేకరిస్తాం. కార్డులో పేరున్న వారు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి. రేషన్ డీలర్లు ఇబ్బందులు పెడితే తమ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

- దీప్తి, ఏఎస్‌వో, పౌర సరఫరాల శాఖ



కాంగ్రెస్ పార్టీ నేతలు డాక్టర్ రోహిణ్‌రెడ్డి, శంభుల శ్రీకాంత్‌గౌడ్ సమక్షంలో భారీ కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీ వీహెచ్



వీహెచ్‌కు కేక్ తినిపిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగభూషణం, తొలుపునూరి కృష్ణగౌడ్ తదితరులు

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి : వీహెచ్

అంబర్‌పేటలో ఘనంగా మాజీ ఎంపీ హనుమంతరావు జన్మదిన వేడుకలు

రాంనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి, బీసీల పక్షపాతి 'అన్నా అంటే నేనున్నా' అంటూ మనవెంట వచ్చే జన నాయకుడు మాజీ ఎంపీ వి.హనుమంతరావు అని పలువురు టీపీసీసీ నేతలు పేర్కొన్నారు. అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన పెద్దదిక్కు మాజీ ఎంపీ వి.హనుమంతరావు జన్మదిన వేడుకలు సోమవారం బాగ్‌అంబర్‌పేటలోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు పారిశుధ్య కార్మికులకు సత్కారం, పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 80 కిలోల భారీ కేక్‌ను వీహెచ్ కట్ చేశారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు తన జన్మదినం సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఇకపై కాంగ్రెస్ పార్టీ నాయకులందరూ వారి జన్మదినం సందర్భాలల పేద ప్రజలకు అన్నదానం చేసి ఒక పూట పేదవాడి కడుపు నింపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రెటరీ విశ్వనాథన్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీలు మల్లు రవి, ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వినోద్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జి.నాగభూషణం, నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, శంభుల శ్రీకాంత్‌గౌడ్, ఉపాధ్యక్షుడు అప్సర్‌బాయ్, మాజీ కార్పొరేటర్ పుల్లా నారాయణస్వామి, శంభుల ఉషశ్రీ, నరేష్‌గౌడ్, రామ్మోహన్, వికాస్, శ్రీకాంత్, అనిల్ కోటం, శ్రీమంత్‌గిరి, పంజాల వెంకటేష్, యూసుఫ్ జాహి తదితరులు పాల్గొన్నారు.

మాన్సూన్ శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్



నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో మాన్సూన్ శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్‌ను తనిఖీ చేసిన కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్, కార్పొరేటర్ అమృత

నల్లకుంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అంటురోగాలు ప్రబలకుండా మాన్సూన్ శానిటేషన్ ప్రత్యేకడ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్ పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్- 16లో మాన్సూన్ శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో జరుగుతున్న కార్యక్రమాన్ని కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు జీహెచ్ఎంసీలో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ సారథ్యంలో ఈనెల 3 నుంచి ప్రారంభమైన శానిటేషన్ కార్యక్రమం 25వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్, జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ మారుతి దివాకర్, ఏఎంహెచ్‌వో హేమలత, డిప్యూటీ ఎగ్జిక్యూటి వ్ ఇంజనీర్ ప్రవీణ్‌కుమార్, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు ఈ సమాజానికి మూలస్తంభాలు

ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం



ఎమ్మెల్సీ, ప్రొ.కోదండరాంను సత్కరిస్తున్న సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు

నల్లకుంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలను నివారించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం పేర్కొన్నారు. వృద్ధులు ఈ సమాజానికి మూల స్తంభాలు, వారిని గౌరవించడం మన సంస్కృతి అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 14వ వరల్డ్ ఎల్డర్స్ అబ్యూస్ అవేర్‌నెస్ కార్యక్రమం సోమవారం నగరంలోని సంస్థ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల్లో వృద్ధుల భద్రతకు పెద్దపీటవేయాలని, వారి సమస్యల పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడం మనందరి బాధ్యత అన్నారు. జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు న్యాయ పరిరక్షణ అందించడం అత్యవసరం అన్నారు. ప్రస్తుత సమాజంలో వారి హక్కులు, గౌరవం కాపాడేందుకు ప్రత్యేక న్యాయ సేవలు అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పాటూరి సుధాకర్‌రెడ్డి, క్రిస్టల్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.నరసింహారావు, నగర అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది కె.శ్యామ్‌సుందర్, ఉపాధ్యక్షులు గోకుల్ నాగన్న, సంయుక్త కార్యదర్శి రావులకుమార్, నాయకులు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడ పల్లి, జూన్ 16 (ఆంధ్ర జ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం టీజీఎస్‌పీడీసీఎల్ సైఫాబాద్ డీఈ నెహ్రూనాయక్‌కు ఆమె వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సమస్యలపై డీఈతో సమీక్షించారు. ఈ సందర్భంగా పావనివినయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ తీగలపై వాలిన చెట్ల కొమ్మలు, ఫీడర్ల వద్ద ప్రమాదకరంగాపెరిగిన చెట్ల కొమ్మలను, చెట్ల తొలగింపు పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. అరుంధతినగర్ బస్తీలో బంచ్‌కేబుల్ ఏర్పాటు చేయాలని, హైటెన్షన్(హెచ్‌టీ) లైన్ తీగల క్రమబద్ధీకరణ, అవసరం ఉన్న చోట్ల నూతన విద్యుత్ పోల్స్, శిథిలమైపోయిన ఇనుప స్తంభాలస్థానంలో సిమెంట్ పోల్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన డీఈ పనులను వేగవంతంగా చేయిస్తామని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారని కార్పొరేటర్ వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, పార్టీ నాయకులు ఎం.ఉమేష్, శివకుమార్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం



ఎంపీ ఎస్.నిరంజన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించిన ఉప్పు సుధాకర్

రాంనగర్, జూన్ 16 (ఆంధ్ర జ్యోతి): అఖిల భారత బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల తరపున కేంద్ర ఉద్యోగులు, డిఫెన్స్ ఉద్యోగులు, రిజర్వు బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులతో సమానంగా పింఛన్‌ను మిగత బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులకు పెంచడం లేదని అఖిల భారత జాతీయ విశ్రాంత ఉద్యోగుల ఉప ప్రధాన కార్యదర్శి ఉప్పు సుధాకర్ పేర్కొన్నారు. ఈ విషయంపై సోమవారం ఎంపీ ఎస్.నిరంజన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఎంపీ ఈ విషయాన్ని రాజ్యసభలో ప్రస్తావించి కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారని సుధాకర్ తెలిపారు.

ప్రమాదకర స్తంభాన్ని తొలగించాలి

ముషీరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): భరత్‌నగర్‌లోని ఓ విద్యుత్ స్తంభం ప్రమాదంగా మారిందని వెంటనే తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి విద్యుత్ అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మెల్యే గోపాల్‌కు బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేయగా అధికారులను ఆదేశించారు. దీంతో ఏడీఈ వినోద్‌కుమార్, ఏఈ సునీల్‌రెడ్డి స్తంభాన్ని పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు.

● వీధి దీపాల కోసం ధర్నా



నగరంలో వీధీదీపాలు లేక అంధకారంలో పేరిట బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం లిబర్టీలోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీజేపీ నాయకులు కె.లక్ష్మణ్‌కుమార్, బి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. - నల్లకుంట, ఆంధ్రజ్యోతి

42 శాతం రిజర్వేషన్లపై స్పష్టమైన ప్రకటన చేయాలి

రాంనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బీసీల 42 శాతం రిజర్వేషన్ల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన విధాన ప్రకటన చేయాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు పోవడం లేదని కుంటి సాకులతో తప్పించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పెంపు సమస్య తేల్చకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. రాజ్యాంగబద్ధమైన అధికారం ఉన్నప్పటికీ పెంచిన రిజర్వేషన్లపై ప్రభుత్వం ఎందుకు జీవో జారీ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, జి.అనంతయ్య, రాందేవ్‌మోదీ, జిల్లపల్లి అంజి, జి.మల్లేష్‌యాదవ్, సి.రాజేందర్, నిమ్మల వీరన్న, జి.కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై జీవో జారీ చేయాలి

బర్కత్‌పుర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బీసీ 42 శాతం రిజర్వేషన్లపై జీవో జారీచేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. జీవో జారీ చేయకుండా ఎన్నికలు నిర్వహిస్తే బీసీలు తీవ్ర స్థాయిలో అడ్డుకుంటారని హెచ్చరించారు. సోమవారం కాచిగూడ నింబోలిఅడ్డలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో తీర్మానం చేసినంత మాత్రానా సరిపోదని, జీవో జారీ చేస్తేనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అందుతాయని పేర్కొన్నారు. తమిళనాడు తరహాలో బీసీ రిజర్వేషన్లను పార్లమెంట్‌లో ఆమోదించి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. బీసీలను నిర్లక్ష్యం చేస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహాసభ నాయకులు పులిజాల కృష్ణ, ముత్యాలరావు, డాక్టర్ ప్రశాంత్, భూషణ్‌భాస్కర్, ప్రదీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

కవాడిగూడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనాలతోపాటు ప్రభుత్వం నుంచి జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐఐ తదితర బకాయిలన వెంటనే చెల్లించాలని పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రిటైర్డ్ ఉపాధ్యాయులు దండు బాల్‌రెడ్డి, జి.హన్మిరెడ్డి, మనోహర్‌రెడ్డి, ఆర్.లక్ష్మీనరసింహ తదితరులు ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఒక రోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రిటైర్డ్ అయిన దాదాపు 10వేల మందికి బకాయిలు చెల్లించాలన్నారు.

ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలి: సీపీఎం

నల్లకుంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆసరా పెన్షన్లను లబ్ధిదారులకు వెంటనే మంజూరు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. 5 సంవత్సరాల నుంచి ఆసరా పెన్షన్ల కోసం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు దరఖాస్తులు చేసుకుంటే గత బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తయిన నేటి వరకు కొత్త పెన్షన్ల మాట ఎత్తడం లేదని సీపీఎం ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఆర్.వెంకటేష్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం బాగ్‌లింగంపల్లిలోని హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సంధ్యారాణికి సీపీఎంనేతలు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కె.రమేష్, వెంకటమ్మ, మల్లయ్య, రమణమ్మ, నారాయణమ్మ, శ్రీనివాస్, వెంకటయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు గురిచేస్తే భయపడం : ఎమ్మెల్యే గోపాల్

రాంనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేటీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం వేధింపులకు గురిచేయడం సరైంది కాదని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతిపై ఎప్పటికప్పుడు ప్రశ్నించే వారిపై ఇలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. కేటీఆర్‌ను ఇబ్బందులకు గురిచేసినంత మాత్రానా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బెదరని ఆయన పేర్కొన్నారు.

జీహెచ్ఎంసీ, హైడ్రా పరిచయ సమావేశం

రాంనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మాన్సూన్ ఎమర్జెన్సీ బాధ్యతలను ఇటీవల జీహెచ్ఎంసీ నుంచి హైడ్రాకు బదిలీ చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం జోనల్ కమిషనర్ రవికిరణ్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులతో పరిచయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వర్షాకాలంలో నాలాల పూడికతీయడం, భద్రత, ట్రాఫిక్ మళ్లింపు, తుఫాన్ నీటి ప్రవాహనికి అడ్డంకులు, పడిపోయిన చెట్లను తొలగించడం వంటి పనులు జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులు సమన్వయంతో చేస్తూ ముందుకు సాగడానికి ఈ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో డీఎంసీలు, ఇంజనీరింగ్ అధికారులు, డీఆర్ఎఫ్‌టీమ్‌లు, డీఎఫ్‌ఓలు పాల్గొన్నారు.

ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి : టీజేఎస్



కలెక్టర్ హరిచందనకు వినతిపత్రం సమర్పించిన నర్సయ్య తదితరులు

రాంనగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ హైదరాబాద్ కలెక్టర్ హరిచందనకు సోమవారం తెలంగాణ జన సమితి గ్రేటర్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, వారికి పెన్షన్ ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంచందర్, సయ్యద్ ఇస్మాయిల్, ఎం.లక్ష్మణ్, జైపాల్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.